నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. గగన్‌పహాడ్, గోల్డ్ డ్రాప్, ఆర్‌ఈసీ, శాతంరాయి, మెట్రో మాల్ విద్యుత్ ఫీడర్లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత ఉంటుందన్నారు. గగన్‌పహాడ్ ప్రధాన రహదారి, గ్రామం, సుచిర్ ఇండియా, పోశంబండ, ఆరాంఘర్ పరివార్ డాబా, ఆర్‌ఈసీ, ప్రెస్టేజ్ ప్రాంతం, వీఎస్‌ఆర్ పారిశ్రామిక వాడ, డ్రీమ్ ఇండియా, గోల్డ్ డ్రాప్, బుద్వేల్ స్టేషన్ వెంకటేశ్వర కాలనీ, కాటేదాన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

నేడు రాములోరికి పంచామృతాభిషేకం

రాజేంద్రనగర్: హైదర్‌గూడలోని చైతన్య విల్లాస్ కాలనీలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పంచామృత అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకం ప్రారంభం అవుతుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి నలుగురు వేద పండితులు ఈ పూజ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. పంచామృత అభిషేకం పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'అవోపా' జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్


నియామక పత్రాలు అందుకున్న శ్రీధర్, స్రవంతి

మణికొండ: ఆర్యవైశ్య ఆఫీసర్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) జిల్లా అర్బన్ అధ్యక్షుడిగా మణికొండకు చెందిన బి.శ్రీధర్‌ను నియమించారు. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ ఆధ్వర్యంలో నగరంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనతో పాటు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా గజ్జల స్రవంతికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారం, సభ్యత్వాల పెంపును చేపట్టి వారి మన్ననలు పొందుతామన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులు అందజేత

మియాపూర్: మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్, భారతీనగర్ డివిజన్‌లలోని 203 మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల 3లక్షల ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రాజు యాదవ్, గౌతమ్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, అన్వర్ షరీఫ్, ప్రతాప్‌రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో దోమలను అరికట్టరా?



బటర్‌ఫ్లై సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ప్రజలు


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

- పలు మార్లు ఫిర్యాదులు చేసినా స్పందించని వైనం
- దోమల కారణంగా ప్రబలుతున్న వ్యాధుల పట్ల ఆందోళన
- ధర్నా చేసిన పలు కాలనీల ప్రజలు

మణికొండ: బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా మణికొండ పురపాలక సంఘం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో దోమలు పెరిగిపోతుండటంపై మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఆందోళన బాట పట్టారు. దోమల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే అరికట్టాలని పలు కాలనీల ప్రజలు నినదించారు.

- మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ బటర్ ఫ్లై సర్కిల్‌లో ది సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వారు ఆందోళన నిర్వహించారు. అనంతరం వారంతా ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌ను కలిసి దోమలు, గుంతల రోడ్లు, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపేంద్రనాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... నెక్నాంపూర్ పెద్ద చెరువు, చిన్న చెరువులలో మురికి నీరు కలవటం, ఓపెన్‌గా పందెన్ వాగు ప్రవహిస్తుండటంతో చుట్టు పక్కల ఉన్న కాలనీలలో దోమల సమస్య విపరీతంగా పెరిగిపోయిందన్నారు.
- దోమల వల్ల ప్రజలు డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలు మార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు లేక పోవటంతోనే శనివారం ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు.
- దోమల నివారణకు రూ. లక్షలు ఖర్చు పెట్టి తెచ్చిన ఫాగింగ్ మిషన్‌లను వృథాగా పడేశారన్నారు. మున్సిపాలిటీలో రూ. కోట్ల నిధులు, సిబ్బంది ఉన్నా ఫాగింగ్ ఎందుకు చేయటం లేదని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు.
- కౌన్సిలర్‌లు బి.పద్మారావు, ఎ.నవీన్‌కుమార్, కాలనీల నాయకులు సుజాత, ప్రసాద్, గణపతి, రాజు, జాఫర్, విజయభాస్కర్, స్వప్న, రాధిక, విజయలక్ష్మి, రూప, అనిత, ది సిటిజన్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్‌రావు, కార్యదర్శి షేక్ ఆరిఫ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బి.శ్రీధర్, ఎం.లక్ష్మయ్య, జి.నరేందర్, రాజేంద్రప్రసాద్, మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం నెలకొందని పలువురు నాయకులు ఆరోపించారు. కార్మిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ శుక్రవారం గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు పలికారు. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు నాగరాజు, నాయకులు రాముయాదవ్, కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, నాగుల నరేందర్ తదితరులు ధర్నాకు మద్దతు పలికారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా కార్మికులకు ఏమాత్రం మంచి జరగలేదన్నారు. పాలకులు ఇకనైనా తమ మొండి వైఖరిని వీడి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గండిపేట మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షులు సురేష్, నవీన్, కోశాధికారి నరేందర్, సి.హెచ్.వెంకటేష్, జగన్‌మోహన్‌రావు, మల్లేష్, సుభాష్, రామాంజనేయులు, శ్రీధర్, తౌఫిక్, కృష్ణ, సి.హెచ్.రాము, లక్ష్మీనారాయణ, నర్సింహ, జనార్ధన్‌రెడ్డి, మహిపాల్, హైమద్, శ్రీధర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్

డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభం


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల వార్డు పరిధిలోని శివపురి కాలనీలో రూ. 15 లక్షల మున్సిపల్ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సంర్భంగా ఆమె మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు ప్రాధాన్యత క్రమంలో నిధులను కేటాయించి అన్ని రకాల అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ నేతలు నాగార్జునరెడ్డి, రాంచందర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి అవగాహన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలిస్తున్న సిబ్బందికి శనివారం సర్కిల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ... రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలో నివసిస్తున్న ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం ఐదు డివిజన్లలో దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు శనివారం కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందులో సిబ్బందికి ఉన్న సందేహాలను నివృత్తి చేసినట్లు వెల్లడించారు. దరఖాస్తుల పరిశీలన మరింత వేగవంతం చేయాలని సూచించినట్లు తెలిపారు. దాదాపు 80 వేల దరఖాస్తులు రాగా 30 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని వివరించారు.

ఇళ్ల లబ్ధిదారులకు శాపంగా ప్రజాపాలన దరఖాస్తులు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నేత అప్పిరెడ్డి ముఖేష్

అత్తాపూర్: ప్రజా పాలన దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శాపంగా మారుతున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ అత్తాపూర్ డివిజన్ సీనియర్ నాయకుడు అప్పిరెడ్డి ముఖేష్ ఆరోపించారు. అత్తాపూర్ డివిజన్ పోచమ్మ బస్తీలో శనివారం ఆయన పర్యటించారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ... పోచమ్మ బస్తీకి చెందిన పేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఆప్షన్ వద్ద అధికారులు టిక్ కొట్టడం మరచిపోవడంతో జీహెచ్‌ఎంసీ ఆన్‌లైన్ సర్వేలో లబ్ధిదారుల పేర్లు రాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. లబ్ధిదారులకు అండగా నిలుస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిరుపేదల లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: జగదాంబిక మహంకాళి అమ్మవారి హుండీ ఆదాయాన్ని ఆలయ ప్రాంగణంలో శనివారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు జరిగింది. ఆమె మాట్లాడుతూ..మూడు నెలల నుంచి హుండీ లెక్కింపు జరగలేదన్నారు. ఈ లెక్కింపులో మొత్తం రూ.1,25,394 వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సర్వేష్, బి.సురేష్‌చారి, వృత్తిపని సంఘం అధ్యక్షుడు టి.శివశంకర్, మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, ఆర్.నర్సింగ్‌రావు, శంకర్, నవీన్ తదితరులున్నారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెరగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఈ సంవత్సరం ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరగాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ బి.మాధవితో సిబ్బంది, వివిధ విభాగాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య అడిగి తెలుసుకున్నారు. కళాశాల లైబ్రరీలో విద్యార్థులకు అందుబాటులో ఉండే పుస్తకాల సంఖ్య అడిగి తెలుసుకున్నారు. మరిన్ని పుస్తకాలు కావాల్సి వస్తే లిస్ట్ తనకు ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. అదే విధంగా గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మితో కూడా డిగ్రీ కళాశాల పనితీరు, అందుబాటులో ఉన్న అధ్యాపకుల గురించి తెలుసుకున్నారు. జూనియర్ కళాశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ పటాన్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, కళాశాల అధ్యాపకులు తదితరులున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

గచ్చిబౌలి: గచ్చిబౌలి జడ్పీహెచ్‌ఎస్‌లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సెక్రటరీ ఎం.రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదలతో ప్రయత్నిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని చెప్పారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న రవికుమార్ యాదవ్

టెక్నో స్పోర్ట్స్ షోరూమ్ ప్రారంభం

గోల్కొండ: ప్రజల అభిరుచులకు అనుగుణంగా స్పోర్ట్స్ వేర్, ఇతర ఉత్పత్తులను అందిస్తున్నామని టెక్నో స్పోర్ట్స్ మెనేజింగ్ డైరెక్టర్ ఝున్‌ఝున్‌వాలా అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలో హై స్ట్రీట్ టెక్నో స్పోర్ట్స్ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా టెక్నో స్పోర్ట్స్ సీఈవో పుస్పెన్ మైటీ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో తమది 7వ స్టోర్ అని అన్నారు. తమ కలెక్షన్‌లో వింటర్ కలెక్షన్ ఒకటని జిమ్ బ్యాగులు, పవర్ బ్యాంకులు తదదితరవి తమ స్టోర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. టెక్నో స్పోర్ట్స్ బిజినెస్ హెడ్ రోహిత్ కులకర్ణి ఉన్నారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

రాజేంద్రనగర్: రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలివీ... బుద్వేల్ ప్రాంతానికి చెందిన నరేశ్(19) శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో బుద్వేల్ ప్రధాన రహదారి రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో బుద్వేల్ నుంచి పీడీపీ చౌరస్తా వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఆ యువకుడిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురైన నరేశ్‌ను స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలయ్యాయని పోలీసులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని ఇద్దరు యువకులు పారిపోతుండగా ఒకరిని స్థానికులు పట్టుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డేటింగ్ యాప్‌తో మోసం: ఇద్దరి అరెస్టు

అత్తాపూర్: గ్రిన్డర్ డేటింగ్ యాప్ ద్వారా బాధితుడిని దోపిడీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి సమాచారం మేరకు... కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన సోహెబ్ ఖాన్, మహ్మద్ సోహెల్‌లు ఈ నెల 3వ తేదీన బాధితుడిని అర్ష్ మెహల్‌లోని నిర్మానుష ప్రాంతానికి పిలిపించి అతడిని బెదిరించారు. డబ్బులు డిమాండ్ చేస్తూ అతడిని కొట్టి చంపుతామని బెదిరించి 47 వేల నగదును ఆన్‌లైన్ ద్వారా దోపిడి చేశారన్నారు. ఈ మేరకు బాధితుడి నుంచి ఫిర్యాదులు స్వీకరించి 24 గంటల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని పోలీసులు పేర్కొన్నారు. నిందితుల నుంచి 31 వేల నగదు, ఒక బైక్, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సంఘం కార్యదర్శి సుధాకర్

మణికొండ: పురపాలక సంఘాలలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సంఘం కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవటం దుర్మార్గమని ధ్వజమెత్తారు. శనివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల కేంద్రాలలో నిర్వహించిన ధర్నా కార్యక్రమాలలో కార్మికులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో 65 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్‌ఎంఆర్ ఫిక్స్ పే, డైలీవేజ్‌ల పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. వారిని పర్మనెంట్ చేయటం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి సంక్షేమ పథకాలు అందటం లేదన్నారు. ప్రమాదాలు జరిగి అనేక మంది కార్మికులు మృతి చెందటంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారందరినీ పర్మనెంట్ చేయటంతో పాటు రెండవ పీఆర్‌సీ ప్రకారం కనీసం వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. వారికి 8 గంటల పని వేళలు, కార్మికులు మరణిస్తే వారి దహన సంస్కారాలకు రూ. 50 వేలు ఇవ్వాలని, రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ డి.ప్రవీణ్‌కుమార్, నార్సింగి మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు మహిపాల్, నాయకులు అహ్మద్, జనార్ధన్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


మణికొండలో మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్

కనీస వేతనాలు చెల్లించాలి

శంషాబాద్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సీరటి మల్లేష్ మాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ. 10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.


శంషాబాద్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

సంపూర్ణ, ఆధునిక విద్య అందించడమే లక్ష్యం


2022 బ్యాచ్ విద్యార్థులను సన్మానించిన సిబ్బంది

రాయదుర్గం: సంపూర్ణ, ఆధునిక విద్యను అందించడమే సొలిటైర్ బిజినెస్ స్కూల్ లక్ష్యమని స్కూల్ డైరెక్టర్ డానియల్ ముర్తుజా అలీ వెల్లడించారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని సొలిటైర్ బిజినెస్ స్కూల్‌లో 2022 బ్యాచ్ విద్యార్థుల అభినందన సభను 'హై ఫ్లైయర్స్ ఆఫ్ సొలిటైర్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా బిజినెస్ స్కూళ్ళలో చదవడానికి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. అనంతరం 2022 బ్యాచ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న దీప్తాన్షు రితేష్, సయ్యద్ మహ్మద్‌హసన్, మహ్మద్ అబ్దుల్ నాఫియాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



గన్‌ఫౌండ్రీ: ఔత్సాహిక రచయితలకు శిక్షణ తరగతులు ఎంతో అవసరమని తెలంగాణ రాష్ట్ర పూర్వ ఎన్నికల అధికారి పార్థసారథి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత్ కల్చరల్ అకాడమీ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం, ఓం సాయితేజ ఆర్ట్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సినీ, టీవీ దర్శకులు, రచయితల శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..యువ రచయిత, దర్శకులు ఈ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..100 మంది ఔత్సాహికులు ఈ శిక్షణలో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టెలివిజన్ రచయితల సంఘం అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, కెమెరామెన్ మీర్, దర్శకులు ప్రేమ్‌కుమార్, చల్లా భానుకిరణ్, రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కల్రా నరేందర్‌రెడ్డి, కోశాధికారి చిత్తరంజన్‌దాస్, యువ దర్శకులు మానస్ దండనాయక్ పాల్గొన్నారు.